

వికలాంగులకు పెట్రోల్ రాయితీకి దరఖాస్తుల స్వీకరణ

శ్రీకాకుళం అర్బన్ : వికలాంగులకు పెట్రోల్ సబ్సిడీ కోసం దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు వికలాంగుల శాఖ సహాయ సంచాలకులు కె కవిత ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో శారీరక వైకల్యం ఉండి సొంత వ్యాపారం గానీ, గుర్తింపు ఉన్న ప్రైవేటు సంస్థల్లో పనిచేస్తూ మూడు చక్రాల మోటారు వాహనం ఉన్న వారు పెట్రోల్ రాయితీకి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుదారులు పూర్తి చేసిన దరఖాస్తు ఫారం, సదరం సర్టిఫికేట్, పెట్రోల్ కొనుగోలు చేసిన బిల్లులు, తెల్ల రేషన్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, వాహన రిజిస్ట్రేషన్ ధ్రువీకరణ పత్రం, బ్యాంకు పాసు బుక్ మొదటి పేజీ, ఆధార్ కార్డు, వ్యాపారం లేదా ప్రైవేటు సంస్థలో పనిచేస్తున్నట్లు ధ్రువీకరణ పత్రం, పాస్‌పోర్టు సైజ్ ఫొటోతో వికలాంగుల సంక్షేమశాఖ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. ఇతర వివరాలకు కార్యాలయపు వేళల్లో 08942 240519 ఫోన్ నంబరును సంప్రదించాలని సూచించారు.

మోదం... ఖేదం

- ఖరీఫ్‌లో తొలుత వర్షాభావ పరిస్థితులు
- గత ఖరీఫ్‌తో పోలిస్తే తగ్గిన సాగు విస్తీర్ణం
- చివరిలో అల్పపీడనాలతో నష్టపోయిన రైతాంగం
- అన్నదాతలకు ఆగిన ఆర్థికసాయం



ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి


జిల్లాలో ఈ ఏడాది వ్యవసాయం కొంత మోదం... కొంత ఖేదం అన్నట్లుగా సాగింది. ఖరీఫ్ ప్రారంభంలో మొదట్లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నా ఆగస్టు, సెప్టెంబరులో పుష్కలంగా వర్షాలు కురవడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా పంటలు సాగయ్యాయి. ఖరీఫ్ చివరిలో తుపాన్లు, భారీ వర్షాలు పంటలకు కాస్త నష్టాన్ని తెచ్చిపెట్టాయి. ధాన్యం దిగుబడి అనుకున్నంత స్థాయిలో వచ్చినా కొనుగోళ్ల కోసం రైతులు ఎదురు చూపులు చూడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. గత ప్రభుత్వ హయాంలో నాలుగేళ్లుగా రైతుభరోసా పేరుతో ఆర్థికసాయం పొందిన అన్నదాతలకు ఈ ఏడాది కేవలం పిఎం కిసాన్ యోజన మాత్రమే అందింది. రైతులకు అన్నదాత సుఖీభవ పేరుతో సాయం అందిస్తామని టిడిపి కూటమి ప్రభుత్వం హామీనిచ్చినా అమలు చేయలేకపోవడంతో, రైతులను తీవ్ర నిరాశకు గురి చేసింది.

ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో వర్షాభావ పరిస్థితులను చవిచూడాల్సి వచ్చింది. జూన్, జూలైలో వర్షపాతం లోటున్నా, ఆగస్టు, సెప్టెంబర్‌లో వర్షాలు సమృద్ధిగా పడడంతో పంటలకు సాగునీటి సమస్యలు తలెత్తలేదు. జిల్లాలో ఈ ఖరీఫ్ సీజన్‌లో సాధారణ వర్షపాతమే నమోదైంది. జిల్లాలో 696.4 మి.మీ వర్షం కురవాల్సి ఉండగా, 780.1 మి.మీ వర్షపాతం నమోదైంది. జిల్లాలో ఖరీఫ్ సాధారణ సాగు విస్తీర్ణం 4,21,655 ఎకరాలు కాగా, అన్నిరకాల పంటలు కలిపి 3,91,448 ఎకరాల్లో సాగు అయింది. సాధారణం కంటే 30,207 ఎకరాల మేర పంటల విస్తీర్ణం తగ్గింది. గతేడాది పంటల సాగు కొంత మెరుగ్గానే ఉంది. ప్రధాన పంట వరికి సంబంధించి సాగు విస్తీర్ణం తగ్గింది. వరి సాధారణ సాగు 3,87,323 ఎకరాలు కాగా, ఈ ఏడాది 3,67,008 ఎకరాల్లో సాగు అయింది. గతేడాది 3,59,350 ఎకరాల్లో వరి సాగయింది. వరి సాగులో 7,658 ఎకరాల్లో విస్తీర్ణం తగ్గింది.

చివరిలో అల్పపీడనాలతో రైతులు ఉక్కిరిబిక్కిరి

డిసెంబరులో వరుసగా ఏర్పడిన అల్పపీడనాలు, రెండు మూడుసార్లు సంభవించిన వాయుగుండాలు రైతులను ఉక్కిరిబిక్కిరి చేశాయి. జిల్లాలో ఇచ్ఛాపురం, కంచిలి, కవిటి, మందస, సోంపేట, గార, లావేరు ప్రాంతాల్లో ఆలస్యంగా విత్తనాలు వేయడం, కోతలు పూర్తి కాకపోవడంతో వేలాది ఎకరాలో పంట నీట మునిగింది. కొన్నిచోట్ల కుప్పలుగా పోసిన ధాన్యంలో మొలకలు వచ్చాయి. వర్షాల ప్రభావంతో ధాన్యం సేకరణకు ఇబ్బందులు తలెత్తాయి. నూర్పులు పూర్తయిన ధాన్యానికి తేమ చేరడంతో వాటిని ఎండబెట్టడానికి రైతులు అవస్థలు పడ్డారు. జిల్లాలో ఈ ఏడాది ఏడు లక్షలకు పైగా ధాన్యం దిగుబడి రాగా, ప్రభుత్వం 4.90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని నిర్ణయించింది. అల్పపీడనాలు, వర్షాలు ధాన్యం సేకరణపై ప్రభావం చూపింది. డిసెంబర్ చివరి నాటికి 2.86లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు.





మారని కౌలు రైతుల దుస్థితి

కౌలు రైతుల దుస్థితి ఈ ఏడాది మారలేదు. భూ యజమానులు అంగీకార పత్రం ఇవ్వకపోవడంతో వేలాది మంది కౌలు రైతులు గుర్తింపు కార్డులకు నోచుకోలేదు. భూ యజమానులు చివరకు ఆధార్ కార్డునూ ఇచ్చేందుకూ నిరాకరించారు. జిల్లాలో దాదాపు 1.50 లక్షల మంది కౌలు రైతులు ఉండగా 8,787 మందికి మాత్రమే కార్డులను అందజేశారు. కౌలు గుర్తింపు కార్డు లేకపోవడంతో బ్యాంకుల నుంచి రుణాలు కూడా దక్కలేదు. దీంతో వారు ప్రయివేట్ వడ్డీ వ్యాపారుల దగ్గర అప్పులు చేసి వ్యవసాయం నెట్టుకొచ్చారు.

వరికి మద్దతు ధర రూ.26 తగ్గింపు

వరి పంటకు ఈ ఏడాదీ కేంద్ర ప్రభుత్వం మద్దతు ధర తగ్గించింది. 2023లో క్వింటాకు రూ.143 పెంచగా ఈ సంవత్సరం రూ.26 తగ్గించింది. గతేడాది ధాన్యం సేకరణ సమయంలో సాధారణ రకానికి క్వింటాకు రూ.2,023 ఏ గ్రేడ్ రకానికి రూ.2,223 చెల్లించారు. ఈ ఏడాది క్వింటాకు సాధారణ రకానికి రూ.2,320, ఎ-గ్రేడ్ రకానికి రూ.2040 చెల్లిస్తున్నారు.

అమలు కాని అన్నదాత సుఖీభవ

గత వైసిపి ప్రభుత్వం రైతుభరోసా పేరుతో విడతల వారీగా పలు సందర్భాల్లో ఆర్థికసాయం అందించేది. ప్రధానమంత్రి కిసాన్ యోజనతో కలిపి ఏడాదికి రూ.13,500 రైతుల ఖాతాల్లో జమ చేసేది. జిల్లావ్యాప్తంగా సుమారు మూడు లక్షల మందికి పైగా రైతులు లబ్ధి పొందేవారు. తాము అధికారంలోకి వస్తే అన్నదాత సుఖీభవ కింద నెలకు రూ.20 వేలు ఇస్తామంటూ ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదు. ఈ ఏడాది పిఎంకెవై సాయం కింద రూ.ఆరు వేలు మాత్రమే రైతుల ఖాతాల్లో జమ అయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎటువంటి సాయం అందకపోవడంతో పంట ఖర్చులు రైతులకు ఆర్థికభారంగా మారాయి. ఈ ఏడాది నవంబరులో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లోనూ నిధులు కేటాయించకపోవడంతో, ఈ ఏడాది సాయం ఎగవేసిందన్న విమర్శలు వచ్చాయి.

ఈ ఏడాదీ తప్పని సాగునీటి వెతలు

ఖరీఫ్ ప్రారంభం నుంచి రైతులను సాగునీటి కష్టాలు వెంటాడుతున్నాయి. జూలైలో పంట కాలువల్లో పేరుకుపోయిన గుర్రపుడెక్క, పూడిక తొలగింపు పనులు కొంతమేర చేపట్టినా ఫలితం కనిపించడం లేదు. పొట్ట, గింజ కట్టే దశకు చేరిన వరి పంటకు సాగు నీరందక అన్నదాతలు ఆందోళన చెందారు. హిరమండలం గొట్టాబ్యారేజీ ద్వారా వంశధార కుడి, ఎడమ కాలువల్లో అడగడుగునా పెద్దఎత్తున గుర్రపుడెక్క, పూడిక పేరుకుపోయింది. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి తర్వాత జూలైలో టెక్కలి, పలాస నియోజకవర్గాల్లోని కొన్నిప్రాంతాల్లో హడావుడిగా జంగిల్ క్లియరెన్స్, పూడిక తొలగింపు పనులు చేపట్టారు. అవేవీ సత్ఫలితాలను ఇవ్వకపోవడంతో ఆయా నియోజకవర్గాలోని పలు ప్రాంతాల్లో వేలాది ఎకరాల్లో వరి పంట ఎండిపోయింది.

రబీలో అపరాలకు స్వల్ప నష్టం

రబీలో అపరాల సాగుకు కొంతమేర నష్టం వాటిల్లింది. డిసెంబరులో కురిసిన వర్షాలకు వందలాది ఎకరాల్లో మినప, పెసర పంటల్లోకి వర్షపు నీరు చేరింది. ఈ సీజన్‌లో పెసర పంట సాధారణ సాగు 7,318 ఎకరాలు కాగా, డిసెంబరు చివరి నాలుగో వారం నాటికి 11,768 ఎకరాల్లో రైతులు పంటలు వేశారు. మినప పంట సాధారణ సాగు 27,758 ఎకరాలు కాగా 19,510 ఎకరాల్లో వేశారు. డిసెంబరులో వరుసగా అల్పపీడనాలతో కురిసిన వర్షాలకు పెసర, మినప పంట నీట మునిగింది.

సమ్మె కాలపు ఒప్పందాలు అమలు చేయాలి

మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్



ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

మున్సిపల్ కార్మికుల సమ్మెకాలపు ఒప్పందాలను తక్షణమే అమలు చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, నగర కన్వీనర్ ఆర్.ప్రకాశరావు, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.బలరాం ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా శ్రీకాకుళం నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ కాంట్రాక్టు అవుట్‌సోర్సింగ్ (ఆప్కాస్) కార్మికులందరినీ పర్మినెంట్ చేస్తామని హామీనిచ్చి నేటికీ నెరవేర్చలేదన్నారు. కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికులందరినీ త్వరితగతిన పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలన్నారు. మున్సిపాలిటీల్లో ఇంజినీరింగ్ కార్మికులైన నీటిసరఫరా, వీధిలైట్లు, యుజిడి విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులను స్కిల్డ్, సెమీ స్కిల్డ్ వర్కర్లుగా గుర్తించి వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. క్లాప్ డ్రైవర్లకు కనీస వేతనం రూ 18,500 అమలు చేయడంతో పాటు అధికారుల వేధింపులు ఆపాలన్నారు. ఆప్కాస్ కార్మికులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్, గ్రాట్యుటీ, పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. మున్సిపాల్టీల్లో పనిచేస్తున్న రెగ్యులర్ ఉద్యోగులకు 12వ పిఆర్‌సి అమలు చేయాలని, సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ అమలు చేయాలన్నారు. పట్టణ అవసరాలకు అనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచాలని కోరారు. వాహనాల మరమ్మతులకు నిధులను మున్సిపల్ యాజమాన్యం చెల్లించాలని, కార్మికులకు పనిముట్లు వెంటనే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ధర్నాలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నగర కమిటీ నాయకులు కళ్యాణ రాజు, అరుగుల రాము, ఎ.మోహన్, ఎన్.పార్వతి, ఎ.లక్ష్మి, ఎం.ఆదెమ్మ, గిరిజాశంకర్, సోమేష్ మణికంఠ, త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకర్ల భాగస్వామ్యంతోనే ఆర్థిక ప్రగతి

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

జిల్లా ఆర్థిక ప్రగతిలో బ్యాంకర్ల భాగస్వామ్యం, సహకారం ఎంతో అవసరమని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. జిల్లాస్థాయి సమీక్షా మండలి డిసిసి, (డిఎల్ఆర్‌సి) సమావేశాన్ని కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గురువారం నిర్వహించారు. కలెక్టర్ ఛాంబరు నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. స్వయం ఉపాధి పథకాల అమలు, రుణాల మంజూరు, గత త్రైమాసికంలో సాధించిన ప్రగతిపై బ్యాంకులు, ప్రభుత్వ శాఖల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక రుణ ప్రణాళికను ఆవిష్కరించారు. జిల్లాలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి రెండో త్రైమాసికం ఆగస్టు 30వ తేదీ నాటికి క్రెడిట్ ప్లాన్ లక్ష్యం రూ.12586.45 కోట్లకు గానూ రూ.9681.68 కోట్ల రుణాలు మంజూరు చేసి 76.92 శాతం ఆర్థిక ప్రగతిని సాధించామన్నారు. జిల్లాలో వ్యవసాయ రంగానికి రెండో త్రైమాసికం నాటికి వ్యవసాయ రుణాలకు సంబంధించి రూ.7,744 కోట్లు లక్ష్యానికి గాను రూ.5,878 కోట్ల రుణాలు అందజేసి 75.9 శాతం సాధించినట్లు లీడ్ బ్యాంకు మేనేజర్ ఎం.సూర్యకిరణ్ తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రుణాల మంజూరులో జాప్యం లేకుండా అర్హులైన లబ్ధిదారులకు మంజూరు చేసేలా బ్యాంకులు ప్రణాళికలు రూపొందించాలన్నారు. గ్రామీణ ప్రాంతాలలో బ్యాంకింగ్ లావాదేవీలు మరింత బలోపేతం చేయాలని సూచించారు. బడుగు, బలహీనవర్గాల వారు ఆర్థికంగా బలపడేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలతో పాటు పంట రుణాలు, విద్యారుణాలు లక్ష్యం మేరకు పూర్తి చేయాలన్నారు. ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలపై దష్టి సారించాలని, ప్రజల జీవనోపాధి మెరుగుపడే విధంగా ప్రభుత్వ పథకాలను అమలు చేయాలని సూచించారు. జిల్లా జిడిపి వృద్ధి చెందేందుకు కృషి చేయాలన్నారు. పారిశ్రామిక రంగం అభివృద్ధి చెందినప్పుడే ఇది సాధ్యపడుతుందని చెప్పారు.

జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ మాట్లాడుతూ కౌలు రైతులు నష్టపోకుండా చూడాలని, వీలైనంత వేగంగా కౌలుదారుల గుర్తింపు కార్డులను పంపిణీ చేయాలన్నారు. అర్హులందరికీ కిసాన్ క్రెడిట్ కార్డులను జారీ చేయాలన్నారు. పిఎం సూర్యఘర్ రుణాల మంజురులో జాప్యం చేయరాదన్నారు. సమావేశంలో రీజనల్ మేనేజర్ ఎం.వి తిలక్, ఆర్‌బిఐ ఎపి రీజియన్ ఎల్‌డిఒ గిరిధర్ బెహరా, డిసిసిబి సిఇఒ డి.వరప్రసాద్, నాబార్డు డిడిఎం కె.రమేష్‌కృష్ణ, ఉద్యాన, వ్యవసాయ, పశుసంవర్ధక, మత్స్యశాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

'ఆదిత్య'లో డేటా డైవ్ ఇంటర్నల్ ఫెస్ట్

ప్రజాశక్తి - శ్రీకాకుళం



ఫెస్ట్‌లో మాట్లాడుతున్న చంద్ర సదన్ గూడె

విద్యార్థులు డేటా సైన్స్ వంటి కోర్సులకు ప్రాధాన్యం ఇవ్వాలని ఎర్నెస్ట్ అండ్ యంగ్ కంపెనీ డేటా అనలిస్ట్ చంద్ర సదన్ గూడె అన్నారు. నగరంలోని కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో డేటా సైన్స్ విభాగం ఆధ్వర్యాన గురువారం నిర్వహించిన ఇంటర్నల్ ఫెస్ట్ వేడుకల్లో ఆయన మాట్లాడారు. తొలుత చార్లెస్ బాబేజ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. శ్రీకాకుళంలో కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో డేటా సైన్స్ కోర్సులు నిర్వహించడం సంతోషదాయకమన్నారు. ప్రస్తుతం అన్ని కార్పొరేట్ సంస్థలు డేటా అనలిస్టులను నియమించుకుంటున్నాయని, డేటా సైన్స్ చేసిన ప్రతి విద్యార్థికి మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. ఫెస్ట్‌లో భాగంగా నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను అందించారు. డైరెక్టర్ బి.ఎస్ చక్రవర్తి, ప్రిన్సిపాల్ కె.శివశంకర్ మాట్లాడుతూ కంప్యూటర్ సృష్టికర్త చార్లెస్ బాబేజ్ జయంతిని పురస్కరించుకుని ఈ ఫెస్ట్‌ను నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. విద్యార్థులు నిరంతరం కొత్త విషయాలపై పరిశోధనలు చేయాలన్నారు. అనంతరం చంద్ర సదన్ గూడె ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కె.వేణు, కంప్యూటర్ విభాగాధిపతి ఎల్.ప్రసాదరావు, కంప్యూటర్ విభాగ అధ్యాపకులు, డేటా సైన్స్ విద్యార్థులు పాల్గొన్నారు.

త్వరితగతిన 'పల్లె పండగ' పనులు

- అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాలు తెరుచుకోవాలి
- ప్రజా ఫిర్యాదుల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ
- జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

పల్లె పండగలో శంకుస్థాపనలు చేసిన అన్ని పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి మండలాల అధికారులతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. పల్లె పండగలో 3,497 పనులు మంజూరు కాగా, 91 శాతం పనులు గ్రౌండ్ అయినట్లు ఆయా అధికారులు చెప్పారు. పనులన్నీ శతశాతం గ్రౌండ్ అయ్యేలా చూడాలని ఎంపిడిఒలను ఆదేశించారు. కోర్టు కేసులపై సకాలంలో స్పందించాలని, కౌంటర్లు సకాలంలో నమోదు చేయాలన్నారు. బాలల ఆధార్ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని చెప్పారు. రెవెన్యూ సదస్సుల్లో సంబంధిత అధికారులు తప్పక పాల్గొనాలన్నారు. గ్రామ పటాలు సక్రమంగా నమోదు చేయాలని, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ప్రతి ఫిర్యాదుదారునితో మాట్లాడాలని, ఇంటింటా సర్వే త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పిఎం సూర్య ఘర్ లబ్ధిదారులను గుర్తించి త్వరితగతిన లక్ష్యాలను చేరుకోవాలన్నారు.


ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉంచిన ధాన్యం తడిసిపోకుండా చూడాలని ఆదేశించారు. అవసరమైన రైతులకు టార్పాలిన్లు, టెంట్లు, గోనె సంచులు, ఇతర వసతులను అందుబాటులో ఉంచాలన్నారు. అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాలు తెరుచుకోవాలని, వచ్చిన ధాన్యం వచ్చేలా సేకరించాలని ఆదేశించారు. వర్షాలకు వాటిల్లిన పంట నష్టాన్ని నమోదు చేయాలని, వీటిని సంబంధిత ఆర్‌డిఒలు పర్యవేక్షించాలని ఆదేశించారు. సమావేశంలో డిఆర్‌ఒ ఎం.వెంకటేశ్వరరావు, ఉప కలెక్టర్లు పద్మావతి, డిపిఒ కె.భారతి సౌజన్య, ఐసిడిఎస్ పీడీ బి.శాంతిశ్రీ, జెడ్‌పి సిఇఒ శ్రీధర్ రాజా, ఇపిడిసిఎల్ ఎస్ఇ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

బిసిలకు తీరని అన్యాయం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్



బిసి, ఒబిసిల ఓట్లతో గద్దెనెక్కిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వారికి తీరని అన్యాయం చేస్తున్నాయని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఒబిసి ఛైర్మన్ సొంటి నాగరాజు విమర్శించారు. నగరంలోని ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్నింట్లోనూ బిసిలు వెనుకబడి ఉన్నారని చెప్పారు. జిల్లాలో బిసి మంత్రులు గతంలో, ఇప్పుడూ ఉన్నా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. జిల్లాలో జీడి సమస్య ప్రధానంగా ఉన్నా, పట్టించుకున్న నాథుడే లేడన్నారు. కూటమి ప్రభుత్వంలో కేంద్రం, రాష్ట్రంలో ముఖ్య పాత్ర పోషిస్తున్న జిల్లాకు చెందిన మంత్రులు జీడి రైతులకు గిట్టుబాటు ధర లభించేలా కృషి చేయాలన్నారు. కాంగ్రెస్ పాలనలోనే బడుగు, బలహీన వర్గాలకు సముచిత స్థానం దక్కిందన్నారు. ఇతర రాజకీయ పార్టీలు వారి అభ్యున్నతిని పూర్తిగా విస్మరించారని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త పాటుపడాలని పిలుపునిచ్చారు. సమావేశంలో డిసిసి అధ్యక్షులు అంబటి కృష్ణారావు, పార్టీ జిల్లా ఇన్‌ఛార్జి జి.వెంకట త్రినాథరావు, నాయకులు ఎం.చక్రవర్తి రెడ్డి, ఎం.సత్యనారాయణ, ఎం.మురళీమోహన్, మహిళా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఈవ్వరి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. శ్రీకాకుళం, కాశీబుగ్గ సబ్ పోలీస్ డివిజన్ అధికారులతో జిల్లా పోలీసు కార్యాలయం నుంచి గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారిపై సంభవిస్తున్న ప్రమాదాలకు గల కారణాలను ఆరా తీసి, నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లావ్యాప్తంగా ఎక్కువ ప్రమాదాలు సంభవిస్తున్న బ్లాక్ స్పాట్ జోన్లను గుర్తించి వాహన చోదకులు, ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహించి రహదారి భద్రత నియమాలు పాటించని వారిపై జరిమానాలు విధించాలని ఆదేశించారు. ప్రధాన చెక్‌పోస్టుల వద్ద వేకువజామున ఫేస్ వాష్ కార్యక్రమం చేసి ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. ట్రాఫిక్ నియమ, నిబంధనలపై ద్విచక్ర వాహనదారులు ప్రామాణికత కలిగిన హెల్మెట్లను ధరించడంపై అతి వేగం, ర్యాష్ డ్రైవింగ్, ట్రిపుల్ డ్రైవింగ్‌పై స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించి అవగాహన కల్పించాలని తెలిపారు. మైనర్లకు వాహనాలు ఇస్తే వారు ఏదైనా ప్రమాదం చేస్తే, సదరు యజమానిపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. మద్యం తాగి వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని, ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులతో రవాణా చేయరాదని అవగాహన కల్పించాలన్నారు. కీలకమైన కూడళ్ల వద్ద తరచుగా ప్రమాదాలు సంభవిస్తున్న ప్రదేశాల్లో ప్రత్యేక కార్యాచరణతో చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో అదనపు ఎస్‌పి కె.వి రమణ, డిఎస్‌పి డి.ఎస్.ఆర్.వి.ఎస్.ఎన్ మూర్తి, టెక్కలి సబ్ డివిజన్ పోలీసు అధికారులు, శ్రీకాకుళం, కాశీబుగ్గ సబ్ డివిజన్ పరిధిలోని పోలీసు అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

పారదర్శకంగా దేహ దారుఢ్య పరీక్షలు

- అభ్యర్థులు దళారులను నమ్మి మోసపోవద్దు
- ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి - శ్రీకాకుళం

కానిస్టేబుల్ దేహ దారుఢ్య పరీక్షలను పారదర్శకంగా నిర్వహించనున్నట్లు ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీస్ రిక్రూట్‌మెంట్‌కి సంబంధించి విధి నిర్వహణలో పాల్గొనున్న పోలీసు అధికారులు, సిబ్బందితో విధి విధానాలు, పాటించాల్సిన నియమాలు, జాగ్రత్తలు, బందోబస్తు తదితర అంశాలపై గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈనెల 30 నుంచి జనవరి 18వ తేదీ వరకు న ఎచ్చెర్ల ఆర్మ్‌డ్ రిజర్వు మైదానంలో నిర్వహించే దేహ దారుఢ్య పరీక్షలకు 7,390 మంది అభ్యర్థులు పాల్గొంటున్నారని తెలిపారు. వీరిలో 6,215 మంది పురుషులు 1175 మంది స్త్రీలు ఉన్నారని చెప్పారు. ఈ పరీక్షల్లో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తున్నట్లు తెలిపారు.

దళారులను నమ్మొద్దు

కానిస్టేబుల్ పోస్టులకు ఉద్యోగాలు ఇప్పిస్తామని దళారుల మాటను నమ్మి మోసపోవద్దని ఎస్‌పి సూచించారు. ఎవరైనా ఉద్యోగాలు ఇప్పిస్తామని, డబ్బులు ఇవ్వాలని చెప్తే వారి సమాచారాన్ని స్థానిక పోలీసులకు గానీ 6309990800, 6309990911 ఫోన్ నంబర్లకు గానీ తెలియజేయాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు.

అభ్యర్థులు పాటించాల్సిన నిబంధనలు

దేహదారుఢ్య పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికేట్లు, అటెస్టెడ్ జిరాక్స్ ధ్రువీకరణ పత్రాలను తప్పనిసరిగా తీసుకురావాలని తెలిపారు. కాల్ లెటర్‌లో తెలిపిన స్కోరు కార్డ్, స్టేజ్- 1, 2 అప్లికేషన్లు తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. కాల్ లెటర్‌లో తెలిపిన తేదీ, సమయానికి హాజరు కావాలన్నారు. నిర్ణీత సమయానికి అభ్యర్థి హాజరు కాకుంటే అభ్యర్థులను అనుమతించబోమని స్పష్టం చేశారు. సమావేశంలో అదనపు ఎస్‌పి కె.వి రమణ, డిఎస్‌పిలు ఎం.అప్పారావు, డి.ఎస్.ఆర్.వి.ఎస్.ఎన్ మూర్తి, ఎఒ సిహెచ్.గోపినాథ్, సిఐ ఎం.అవతారం, ఆర్ఐ నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.


రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

ప్రజాశక్తి- పోలాకి

గ్రామాలకు సిసి రహదారులు, బిటి రహదారుల నిర్మాణానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. గురువారం మండలంలో పలు రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ముందుగా దీర్ఘాశిలో రూ.15 లక్షలతో ఇందుర్లుల్ సిసి రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. తోటాడ రోడ్డు నుంచి సన్యాసిరాజుపేట వరకు రూ.కోటి 10 లక్షలతో బిటి రోడ్డు నిర్మాణానికి, ఇలపండపేట జంక్షన్ నుంచి జొన్నయ్యపేట వరకు రూ.50 లక్షలతో సిసి రహదారి నిర్మాణానికి, చీడివలస నుంచి గవరంపేట వరకు రూ.50 లక్షలతో సిసి రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో పిఆర్ డిఇఇ సత్యం నాయుడు, మాజీ డిసిసిబి ఛైర్మన్ డోల జగన్, ఎంపిపి ప్రతినిధి ముద్దాడ బైరాగి నాయుడు, సాగునీటి డిస్ట్రిబ్యూటర్ కమిటీ ఛైర్మన్ ఎం.వెంకట అప్పలనాయుడు, ధర్మాన తేజ్ కుమార్, దీర్ఘాసి సర్పంచ్ మెండ సుమంగళి, ఎస్ ఎల్ పురం సర్పంచ్ వై.నీలవేణి, ప్రతినిధి వై.వెంకట రమణ, టిడిపి నాయకులు బైరి భాస్కరరావు, బి.భూషణరావు, సూరపు నారాయణ దాసు, ఉలకాల రాంబాబు, పి.సింహాచలం, గొండు మురళి, డోల ప్రసాదరావు, దంత సింహాచలం, బెవర సింహాద్రి, చింత కరెన్న తదితరులు పాల్గొన్నారు.


పాఠశాల రికార్డులను పరిశీలిస్తున్న ఎపిడి శశిభూషణరావు

శతశాతం ఫలితాల సాధనే లక్ష్యం

ప్రజాశక్తి- లావేరు

కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాల విద్యార్థినిలు ఇంటర్మీడియట్ పరీక్షల్లో శతశాతం ఫలితాలు సాధించే లక్ష్యంగా పని చేయాలని సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు డైరెక్టర్ సంపతిరావు శశిభూషణరావు అన్నారు. గురువారం మండలంలోని మురపాక కెజిబివి పాఠశాలను ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాల పరిశుభ్రత, భోజన మెను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థులు ఎలా చదువుతున్నారు, పాఠ్యాంశాలు ఎన్ని అయ్యాయు అన్న విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. బాగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. పరీక్షల సమయం దగ్గర పడుతున్న దృష్ట్యా సిలబస్ త్వరితగతిన పూర్తి చేసి విద్యార్థులను పరీక్షలకు సంసిద్ధం చేయాలన్నారు. అనంతరం పాఠశాల రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈయనతో ప్రిన్సిపాల్ బల్ల సుధారాణి, ఉపాధ్యాయులు ఉన్నారు.


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డైరెక్టర్ నాగేశ్వరరావు

'ఐతమ్'లో నూతన పుస్తకావిష్కరణ

టెక్కలి రూరల్: టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాల బేసిక్ సైన్స్ అండ్ హ్యుమానిటీ (బిఎస్‌ఇండ్‌హెచ్) విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసరిగా విధులు నిర్వహిస్తున్న దీపక్ కుమార్ బెహారా రచించిన మైండ్ అండ్ మైండ్ - ది ఫిజియాలజీ ఆఫ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అనే నూతన పుస్తకాన్ని కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు గురువారం తన కార్యాలయంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు అత్యంత ప్రాధాన్యత సంతరించుకొన్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో వస్తున్న మార్పులపై సరళంగా అర్థమయ్యేలా రచయిత వివరించారన్నారు. కంప్యూటర్స్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విభాగాల్లో చదువుతున్న విద్యార్థులకు ఈ పుస్తకం ఎంతో ఉపకరిస్తుందన్నారు. ఈ పుస్తకావిష్కరణలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, డీన్ ఆర్‌అండ్‌డి డాక్టర్ డి.శ్రీరాములు, బిఎస్‌ఇండ్ హెచ్‌డిలు డాక్టర్ ఎం.వి.రత్నమణి, డాక్టర్ ఎం.రమణయ్యలు పాల్గొని రచయిత దీపక్ కుమార్ బెహారాను అభినందించారు.


విచారణ చేస్తున్న ఆర్‌డిఒ కృష్ణమూర్తి

శిశువు మృతిపై ఆర్‌డిఒ విచారణ

టెక్కలి రూరల్: టెక్కలి జిల్లా ఆస్పత్రిలో బుధవారం ఒక శిశువు మృతి చెందిన విషయం పాఠకులకు విదితమే. ఈ మేరకు గురువారం ఆస్పత్రిలో టెక్కలి ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తి విచారణ చేపట్టారు. గర్భిణీ ప్రసవం సమయంలో డ్యూటీలో ఉన్న వైద్యులతో పాటు సిబ్బందితో మాట్లాడిన ఆయన ఘటనపై విచారణ జరిపారు. బాధితులు ఇచ్చిన వివరణ నమోదు చేసుకున్నారు. శ్రీకాకుళం రిమ్స్ గైనకాలజిస్ట్‌తో మాట్లాడి తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. ఆయనతో పాటు తహశీల్దార్ దిలీప్ చక్రవర్తి, పలువురు వైద్యులు ఉన్నారు.

టీచర్ మృతికి సంతాపం

టెక్కలి: మండలంలోని సన్యాసిపేటలో ఉపాధ్యాయునిగా విధులు నిర్వహిస్తూ ఇటీవల కారు ప్రమాదంలో మరణించిన త్రివేణి ఆకస్మిక మృతికి మండల ఉపాధ్యాయులు గురువారం సాయంత్రం సంతాపం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు దల్లి తులసీరావు రెడ్డి, చిన్నారావు, యుటిఎఫ్ నాయకులు తమ్మినేని వైకుంఠరావు, కురమాన దాలయ్య, మారం కుమార స్వామి, ఎపిటిఎఫ్ నాయకులు బొడ్డేపల్లి నేతాజీ, శ్రీనివాసరావు, మండల విద్యాశాఖ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అంకితభావంతో ముందుకు సాగాలి

ఎచ్చెర్ల: స్వార్థ, అంకిత భావంతో ముందుకు సాగాలని రిజిస్ట్రార్ ఆచార్య సంధ్య అమరేంద్ర కుమార్ అన్నారు. రాజీవ్‌గాంధీ యూనివర్శిటీలో ఫ్యాకల్టీ ఓరియంటేషన్ ప్రోగ్రాంలో ఫ్యాకల్టీకి దిశానిర్దేశం చేశారు. ఫ్యాకల్టీ ఎచ్చెర్ల ట్రిపుల్ ఐటిని సందర్శించారు. ఫ్యాకల్టీలు అవగాహన కల్పించి విద్యార్థులకు మంచి బోధన చేసి ఉత్తమ ఫ్యాకల్టీలుగా గుర్తింపు పొందాలన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ కొక్కిరాల వెంకట గోపాలధన బాలాజీ, పరిపాలన అధికారి మునిరామకృష్ణ, డీన్ మోహన్ కృష్ణ చౌదరి, వెల్ఫేర్ డీన్ గేదెల రవి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం మత్తులో వీరంగం

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలో పగలు, రాత్రి తేడా లేకుండా విచ్చలవిడిగా మద్యం దొరకడంతో మందుబాబులు రైల్వే ప్రయాణికులు, ప్రజలపై వీరంగం సృష్టించడం నిత్యకృత్యంగా మారింది. గురువారం ఉదయం ఆరు గంటల సమయంలో రైల్వేస్టేషన్ ఆవరణలో ఓ వ్యక్తి (కుక్కల ప్రసాద్ మద్యం మత్తులో కనిపించిన ప్రతి వ్యక్తిని కొడుతూ నోటికి వచ్చినట్లు అసభ్య పదజాలంతో దూషిస్తూ వీరంగం సృష్టించాడు. పట్టణంలోని వెంకటేశ్వర ఐటిఐలో రాత్రి కాపలాదారుగా పనిచేస్తున్న గోవింద అనే వ్యక్తిని పిలిచి భవాని మాల నిన్ను ఎవరు ధరించమన్నారని చెంపలు వాయుకొట్టి ఇంకోసారి మాలవేస్తే నీ అంతు చూస్తానని హెచ్చరించడంతో ఫలహారం దుకాణాల వద్ద ఉన్న రైల్వే ప్రయాణికులు భయంతో పరుగులు తీశారు. కొద్దిసేపటి తరువాత రైల్వేస్టేషన్ పక్కన ప్రధాన రహదారిపై ఉన్న మున్సిపల్ భవన దుకాణాల సముదాయం వద్ద ఉన్న ఫలహార దుకాణం వద్దకు వెళ్లి అక్కడ పనిచేస్తున్న రమేష్ అనే వంట కార్మికుడుతో గొడవపడి ఆయన చొక్కాను చింపివేసి అసభ్య పదజాలంతో దూషించడంతో ఇరువురు మధ్య కాసేపు ఘర్షణ వాతావరణం తలెత్తడంతో ఫలహారం తింటున్న ప్రయాణికులు పలువురు అర్ధాంతరంగా ముగించి అక్కడ నుంచి నిష్క్రమించారు. కొంతమంది ప్రయాణికులు 100కు డయల్ చేద్దామని ముందుకు వచ్చినప్పటికీ తోటి ప్రయాణికులు మనం ఈరోజు ప్రయాణం నిమిత్తం ఇక్కడకు వచ్చామని మనకెందుకు ఈ గొడవ అంటూ అక్కడి నుంచి వెళ్లిపోయారు. వంట కార్మికుడు రమేష్ పోలీసులకు ఫిర్యాదు చేస్తానని తెలుపగా ఎవడైతే నాకేంటి అంటూ నోటికి వచ్చినట్లు పోలీసులను కూడా దుర్భాషలాడడంతో అక్కడ ఉన్న వారంతా నిచ్చేస్థులయ్యారు. ప్రతిరోజు ఇలాగే మద్యం మత్తులో తాగి వచ్చి కొంత మంది నానా దుర్భాషలాడుతూ బెదిరించడం పరిపాటిగా మారిందని దుకాణదారులు వాపోతున్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగేలా మందు బాబులు ఇలా వ్యవహరిస్తుంటే తాము ప్రయాణాలు చేసేది ఎలా అంటూ పలువురు ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా రైల్వేస్టేషన్ పరిధిలోని రైల్వే పోలీసులు ప్రధాన రహదారిపై సివిల్ పోలీసులు మద్యాన్ని అరికట్టాల్సిన ఎక్సైజ్ పోలీసులు నిఘా ఏర్పాటు చేసి ఇటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.


వంట కార్మికునితో వాగ్వాదం చేస్తున్న ప్రసాద్

దరఖాస్తులకు ఆహ్వానం

ప్రజాశక్తి- టెక్కలి


మాట్లాడుతున్న ఆర్‌డిఒ కృష్ణమూర్తి

టెక్కలి డివిజన్ పరిధిలోని టెక్కలి, కోట బొమ్మాళి, సంత బొమ్మాళి, సారవ కోట, ఎల్.ఎన్ పేట, హిర మండలం, మెలియా పుట్టి, కొత్తూరు, పాతపట్నం మండలాల్లో ఖాళీగా ఉన్న 59 రేషన్ డిపోల భర్తీకి దరఖాస్తులు కోరుతున్నట్లు టెక్కలి ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తి అన్నారు. గురువారం విలేకరులతో మాట్లాడారు. జనవరి 9లోగా టెక్కలి ఆర్‌డిఒ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు తహశీల్దార్ కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు. అదే విధంగా టెక్కలి జగతిమెట్ట జగనన్న కాలనీలో ఇటీవల రెవెన్యూ అధికారులు దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. అయితే దర్యాప్తులో పనులు ప్రారంభించని 30 ప్లాట్లకు చెందిన పట్టాలు రద్దు చేయనున్నట్లు తెలిపారు. సుమారు 200 మంది వారి ఒరిజినల్ పట్టాలు చూపించలేదన్నారు. దీనిపై మరోసారి పూర్తిస్థాయిలో దర్యాప్తు నిర్వహించి తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు ఆర్‌డిఒ పేర్కొన్నారు. ఆర్‌డిఒతో పాటు టెక్కలి తహశీల్దార్ దిలీప్ చక్రవర్తి ఉన్నారు.


సతీష్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

మరిన్ని పతకాలు కైవసం చేసుకోవాలి

ప్రజాశక్తి- నరసన్నపేట

మరిన్ని పతకాలు సాధించి, మరింత మందికి ఆదర్శంగా నిలవాలని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. నరసన్నపేట మండలం కంబకాయ గ్రామానికి చెందిన పాగోటి సతీష్ కుమార్, తండ్రి వెంకటరావు కలకత్తాలో జరిగిన నేషనల్ బాడీ బిల్డింగ్‌లో జిల్లా నుంచి పాల్గొని గోల్డ్‌మెడల్ కైవసం చేసుకున్నారు. గురువారం నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తిని మర్యాద పూర్వకంగా కలిసి గెలుపొందిన బంగారు పతకాన్ని ఎమ్మెల్యే చేతులమీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మరిన్ని పోటీల్లో పాల్గొని దేశానికి, రాష్ట్రానికి, జిల్లాకు మంచి పేరు తీసుకువచ్చి యువతకు ఆదర్శంగా నిలవాలన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


వరి పంటను పరిశీలిస్తున్న అధికారులు

పంట నష్టంపై నివేదిక అందిస్తాం

మెళియాపుట్టి: మండల పరిధిలో గల జగన్నాధపురం, శేఖరపురంలో పలాస వ్యవసాయ సహాయ సంచాలకులు ఎల్.వి. మధుబాబు, తహశీల్దార్ పాపారావు, మండల వ్యవసాయ అధికారి దానకర్ణుడుతో కలిసి గురువారం క్షేత్ర పరిశీలన చేశారు. రైతులకు భరోసా కల్పించారు. ధాన్యం మొలకలు వచ్చిన, వరి కుప్పలు, ధాన్యాన్ని పరిశీలించారు. గ్రామాల వారీగా నివేదికను ఉన్నతాధికారులకు పంపించటం జరుగు తుందన్నారు. విఎఎలు జయలక్ష్మి, సూర్య, విఆర్ఒ సత్యనారాయణ, సర్పంచ్ శంకరరావు, నాయకులు చక్రి, మోహనరావు, ఖగేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

నేడు ఇంటర్వ్యూలు

నందిగాం: మండలంలో మదనాపురం వద్దగల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో ఒప్పంద ప్రాతిపదికన చేపడుతున్న అసిస్టెంట్ కుక్ నియామ కానికి శుక్రవారం నందిగామ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు మండల ఎంఇఒ-2 ఎ.చిన్నారావు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వారు సమయానికి హాజరు కావాలన్నారు.

నియోజకవర్గస్థాయి గ్రిగ్స్ పోటీలు

వజ్రపుకొత్తూరు: నియోజకవర్గ స్థాయి గ్రెగ్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు హెచ్ఎం కె.హరిబాబు తెలిపారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 30, 31 తేదీల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గోవిందపురంలో ఆటల పోటీలు జరుగుతాయని తెలిపారు. ఈ పోటీల్లో పలాస నియోజకవర్గ పరిధిలో గల పాఠశాల గ్రిగ్స్ మీట్‌లో విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. స్థానిక వ్యాయామ ఉపాధ్యాయుడు నాగరాజు పర్యవేక్షిస్తారన్నారు.

ఛార్టర్ ఆఫ్ డిమాండ్లను నెరవేర్చాలి

ప్రజాశక్తి- మందస

మండలం సారంగపురంలో రైస్‌మిల్లు కార్మికుల చార్టర్ ఆఫ్ డిమాండ్స్ వెంటనే పరిష్కరించాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. రైస్ అండ్ ఆయిల్ మిల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో రాధాకృష్ణపురం, సారంగిపురం జంక్షన్‌లో సిఐటియు కార్యాలయంలో కె.కేశవరావు అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సర్పంచ్ సిహెచ్ గణపతి, బిఎస్‌పురం ఎంపిటిసి మట్ట షణ్ముఖరావు, మాజీ ఎంపిటిసి మురపాల నారాయణ, సొండి పూడి సర్పంచ్ సిహెచ్ శ్రీను, సిద్ధిగామ్ సర్పంచ్ గున్న రమణ, మూలిపాడు సర్పంచ్ గుసిరి వెంకటరావు, చైతన్య రైతు సంఘం నాయకులు కొర్ల హేమారావు చౌదరి, జేడి రైతు సంఘం జిల్లా కన్వీనర్ టి.అజయ్ కుమార్, మహేంద్ర రైతు సంఘం నాయకులు బి.కామేశ్వరరావు, రైతు ప్రతినిధి కె.రఘురామయ్య, బెపల తిరుపతిరావు, ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు, ఎం.ధర్మారావు, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎస్.లక్ష్మీనారాయణ, గిరిజన సంఘం నాయకులు సవర పాల్గుణరావు తదితరులు ప్రసంగించారు. రైస్‌మిల్లుల్లో జరుగుతున్న అగ్రిమెంట్, కార్మికుల పరిస్థితిని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి వివరించారు. దింపు చార్జీ పేరుతో బస్తాకు రూ.20 రైతుల వద్ద తీసుకుంటున్న యాజమాన్యం కార్మికులకు రూ.17 మాత్రమే ఇస్తున్నారన్నారు. రైతుల వద్ద తీసుకుంటున్న ధాన్యం తేమ పేరుతోనూ, అధిక తూకం వేసి అటు రైతులను కూడా రైస్‌మిల్లు యాజమాన్యాలు దోపిడి చేస్తున్నాయన్నారు. దీనిపై రైతులు, కార్మికులు కలిసి కట్టుగా పోరాడాలని పిలుపునిచ్చారు. జనవరి 2న మందస మార్కెట్‌లో ర్యాలీ, తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైస్ మిల్లు వర్కర్స్ యూనియన్ నాయకులు టి.లక్ష్మీనారాయణ, కె.బాలకృష్ణ, కె.కృష్ణారావు, కుర్మారావు, బి.దుర్యోధన, ఆర్.ఏకాశీ, బి.వెంకటేశం, బి.మల్లేశ్వరరావు, గిరిజన సంఘం నాయకులు సవర నరసింహ, కార్మికులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సిఐటియు జిల్లా కార్యదర్శి గణపతి

కొంపముంచిన ముసురు

◆ మొలకలొచ్చిన ధాన్యం ◆ రైతుకళ్లలో దైన్యం


ప్రజాశక్తి- కవిటి

ఆరుగాలం కష్టపడి పండించిన పంట అకాల వర్షాలకు తడిసి ముద్దయింది. వారంపాటు పట్టిన ముసురుకు కోసిన పంటతో పాటు కుప్పల్లో ధాన్యం, నూర్పుచేసి పొలాల్లో పొగుపెట్టిన ధాన్యాల్లో చాలావరకు మొలకలు వచ్చేశాయి. దీంతో చేతికొచ్చిన పంట చేజారిపోతుంటే చేసేది లేక చేష్టలుడి చూస్తున్నాడు రైతన్న. కవిటి మండలం ప్రగడపుట్టుగ గ్రామానికి చెందిన పండి విజయకుమార్ తనకున్న 40 సెంట్లు భూమిలో వరి సాగు చేశాడు. పంట బాగా రావడంతో ఏడాది పొడవునా తిండికి ఇబ్బంది ఉండదని అనుకున్నాడు. కానీ వరుస అల్పపీడనాలు అతడి పొట్ట కొట్టాయి. వర్షానికి తడిసిపోయిన పంట గురువారం నాటికి పూర్తిగా మొలకలొచ్చేసింది. దీంతో ఏం చేయాలో తెలియని దిక్కుతోచని స్థితిలో ఉంది ప్రస్తుతం ఆ రైతు పరిస్థితి. ఈ సమస్య కేవలం విజయకుమార్ ది మాత్రమే కాదు. నియోజకవర్గంలోని అనేక మంది రైతన్నలది.


తడిసిన వరి పనలు ఆరబెడుతున్న మహిళ
మొలకెత్తిన వరి పనలు

సిఎం దృష్టికి మంచినీటి సమస్య

ఎమ్మెల్యే గౌతు శిరీష


మహిళలకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శిరీష

ప్రజాశక్తి- పలాస

పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని మంచినీటి సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందని ఈ మేరకు కలెక్టర్‌కు ఆదేశాలు కూడా అందాయని, వేసవి నాటికి మంచినీటి సమస్య పరిష్కరించడం జరుగుతుందని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో గురువారం పారిశుధ్య కార్మికుల అభినందన సభలో పారిశుధ్య కార్మికులకు దుస్తులు, కాస్మోటిక్స్, డ్వాక్రా మహిళలకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణంలో పారిశుధ్యం, లైటింగ్ సమస్యలు ఎక్కువగా ఉన్నాయని తన దృష్టికి వచ్చాయన్నారు. తొందరలోనే వంద విద్యుత్ స్థంబాలు రానున్నాయని, విద్యుత్ సమస్య తొలగించనున్నామన్నారు. అలాగే పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. ప్రజలు తనను అభిమానించే విధంగా పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీని సుందర మున్సిపాలిటీ రూపొందించడమే ధ్యేయంగా పనిచేయడం జరుగుతుందన్నారు. మహిళలు అభివృద్ధి చెందేందుకు డ్వాక్రా రుణాలు మంజూరు చేయడం, తిరిగి బ్యాంకులకు సక్రమంగా రుణాలు చెల్లిస్తే వడ్డీ డబ్బులు తిరిగి ప్రభుత్వం చెల్లిస్తుందని చెప్పారు. అందులో భాగంగానే చెక్కులు పంపిణీ చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, కమీషనర్ ఎన్.రామారావు, టిడిపి నాయకులు లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ టిడిపి నాయకులు పాల్గొన్నారు.

కొబ్బరి పంటపై విష ప్రయోగం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు


మండలంలో బాతుపురం పంచాయతీ సర్పంచ్ బత్తిని సృజన లక్ష్మీనారాయణకు చెందిన కొబ్బరితోటలో గుర్తు తెలియని వ్యక్తులు విష ప్రయోగం చేసి పంటను ధ్వంసం చేశారు. బాధితుడు లక్ష్మీనారాయణ తెలిపిన వివరాల మేరకు.. వైసిపికి అనుకూలంగా ఉండటంతో పాటు తమ ఎదుగుదలను ఓర్వలేక తమపై దుండగులు కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. ఇప్పటికే రెండుసార్లు కొబ్బరి మొక్కలపై విషప్రయోగం చేయటంతో పంట నష్టం కలిగిందన్నారు. నేడు మరోసారి కొబ్బరి మొక్కలపై విష ప్రయోగం చేసి పంట నష్టానికి పూనుకున్నారని వాపోయాడు. తిత్లీ తుపాను సృష్టించిన భీభత్సంతో సుమారు రెండు ఎకరాల్లో కొబ్బరి పంటకు తీవ్రంగా నష్టం కలిగిందని, లక్షలు రూపాయలు ఖర్చు పెట్టి కడియం నుంచి కొబ్బరి మొక్కలు తెచ్చి వాటి స్థానంలో నాటానన్నారు. అయితే కొబ్బరి మొక్కలు ఎదుగుతున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇలాంటి అకృత్యాలకు పాల్పడి తమకు ఆర్థికంగా, మానసికంగా దెబ్బ తీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా తమపై కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని కోరారు.


మొక్కలను చూపిస్తున్న సర్పంచ్

ఎపి ప్రాథమిక ఉపాధ్యాయ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులుగా ఎస్‌విఎల్ఎస్ పూర్ణిమ ఎన్నికయ్యారు. గురువారం నగరంలోని గూనపాలెంలో నలంద స్కూల్‌లో సంఘం సర్వసభ్య సమావేశం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.మాధవరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ఎన్నికల అధికారిగా టి.శివరావు పర్యవేక్షించారు. సంఘ అధ్యక్షులుగా పూర్ణిమతో పాటు సెక్రటరీగా కె.జగన్మోహనరావు, ట్రెజరర్‌గా కె.మాధవరావులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన అధ్యక్షురాలు పూర్ణిమ మాట్లాడుతూ జిఒ 107 రద్దు చేసేందుకు ప్రభుత్వం అంగీకరించడంపై హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర కమిషనర్ విజయ రామరాజు సోదర సంఘాల సమావేశంలో టీచర్ ప్రొఫైల్ అప్డేట్ చేసుకునే అవకాశం కల్పించడం అభినందనీయమన్నారు. ఈ అవకాశాన్ని ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే 117 జిఒను రద్దు చేసి, అనంతరం రేషనలైజేషన్ తర్వాత బదిలీ ప్రక్రియ చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం సభ్యులు గోవిందరాజులు, ఎ.రామారావు, డి పార్వతీశం తదితరులు పాల్గొన్నారు.


టెక్కలి రూరల్ : సమావేశంలో మాట్లాడుతున్న తిలక్

నేడు వైసిపి పోరుబాట

పలాస: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలు బాదుడుపై పోరుబాట కార్యక్రమాన్ని శుక్రవారం పలాస విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్నట్లు మాజీమంత్రి సీదిరి అప్పలరాజు ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, కౌన్సిలర్లు, జెడ్‌పిటిసిలు, అధ్యక్షులు, మండల అధ్యక్షులు, పార్టీ అనుబంధ సంఘాల అధ్యక్షులు సభ్యులు, బూత్ కన్వీనర్లు, కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

వజ్రపుకొత్తూరు: విద్యుత్ చార్జీల బాదుడుపై పోరుబాటను విజయవంతం చేయాలని ఎంపిపి ఉప్పరపల్లి నీలవేణి ఉదయ్ కుమార్ కోరారు. వైసిపి ఆధ్వర్యంలో మాజీ మంత్రి అప్పలరాజు నేతత్వంలో పలాస విద్యుత్ కార్యాలయం వద్ద ఈ నెల 27న నిర్వహించనున్న కార్యక్రమాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

టెక్కలిరూరల్: రాష్ట్రంలో టిడిపి ప్రభుత్వం పెంచిన విద్యుత్ ధరలు తగ్గించాలని వైసిపి చేపడుతున్న విద్యుత్ ధర్నా విజయవంతం చేయాలని వైసిపి టెక్కలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేరాడ తిలక్ పిలుపునిచ్చారు. వైసిపి కార్యాలయంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. స్థానిక ఇందిరా గాంధీ జంక్షన్ నుంచి విద్యుత్ కార్యాలయం వరకు వెళ్లి ధర్నా నిర్వహించి అనంతరం వినతిపత్రం అందజేయడం జరుగుతుందన్నారు. నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిటిసిలు సత్తారు సత్యం, వాకాడ శ్రీధర్ రెడ్డి, హనుమంతు వెంకటేశ్వరరావు, జయమోహన్, తమ్మన్నగారి కిరణ్, దివ్వెల పాలయ్య, పీత రమణ, సోమేశ్వరరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాతపట్నం: మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి కార్యాలయంలో వైసిపి మండల పార్టీ అధ్యక్షుడు సవిరిగాన ప్రదీప్ ఆధ్వర్యంలో నిరసన పోరాట పోస్టర్‌ను విడుదల చేశారు. 27న చేపట్టనున్న నిరసన నాయకులు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కొండల అర్జునరావు, ఏనుగుతల సూర్యం, ఎం.తాతయ్య మాస్టర్, ఎం.గణపతి మాస్టర్, పనుకు మోహనరావు, ప్రవీణ్ కుమార్, మజ్జి వరదరాజు, నేతాజీ, బెజ్జిపల్లి శ్రీధర్, షణ్ముఖరావు, టంకాల సుధాకర్, తిరుపతిరావు, త్రినాథరావు, పెద్దింటి సుందరరావు, పైల భోగిరాజు, తమ్మిరెడ్డి వంశీ, ఫల్గుణరావు పాల్గొన్నారు.

కేశవరెడ్డి స్కూల్ టీచర్ ఆత్మహత్య

ప్రజాశక్తి- ఎచ్చెర్ల


నీరజ (ఫైల్)

మండల కేంద్రంలో కేశవరెడ్డి స్కూల్‌లో అసోసియేట్ టీచర్ గనగల నీరజ (22) ఆత్మహత్యకు పాల్పడి మృతిచెందింది. ఎస్ఐ వి.సందీప్ కుమార్ వివరాల మేరకు గార మండలం కళింగపట్నం పంచాయతీ నగరాల పేటకు చెందిన ఆమె ఆరు నెలల నుంచి కేశవరెడ్డి స్కూల్‌లో పనిచేస్తుందని, ఈమె అక్క హేమలత మూడేళ్లుగా ఇదే స్కూల్‌లో రిసెప్షనిస్ట్‌గా విధులు నిర్వహిస్తుందన్నారు. వీరిద్దరూ స్కూల్ వసతి గృహంలోనే ఉంటూ విధులకు హాజరవుతున్నారని, బుధవారం క్రిస్మస్ కారణంగా పాఠశాలకు సెలవు కావటంతో నీరజ తన గదిలో ఉండిపోగా అక్క విధులకు హాజరైందని, వీరిద్దరూ మధ్యాహ్నం భోజన సమయంలో కలుసుకొని మళ్లీ తన అక్క విధుల్లోకి వెళ్ళగా నీరజ తన గదికి చేరుకుంది. ఆ తరువాత గదిలో ఉన్న ఫ్యాన్‌కి చున్నీతో ఉరి వేసుకుంది. అక్క హేమలత విధులు ముగించుకుని సాయంత్రం 6 గంటలకు రూమ్‌కు చేరుకొని తలుపు తట్టగా ఎప్పటికీ తెరవకపోవడంతో తలుపు సందులో నుంచి డోర్ తెరిచి లోపలికి వెళ్లి చూడగా చెల్లి విగత జీవిగా వేలాడుతూ కనిపించిందన్నారు. దీంతో ఆమె కేకలు వేయగా క్యాంప్ హౌస్‌లో ఉన్న చుట్టుపక్కల వారంతా వచ్చి నీరజ మెడకి ఉన్న చున్నీని తప్పించారు. అప్పటికే ఆమె ప్రాణం కోల్పోయిందన్నారు. నీరజ అక్క తన స్వగ్రామంలో ఉన్న తాతయ్యకు సమాచారం అందించగా తాతయ్య సూచనల మేరకు స్కూల్ కారులో మృతదేహాన్ని సొంత గ్రామం నగరాలపేట స్వగ్రామానికి చేర్చటంతో అక్కడ బంధువులు, గ్రామస్తులు ఎలా మృతి చెందిందో తెలియకుండా పోస్టుమార్టం నివేదిక లేకుండా గ్రామానికి ఎలా తెస్తారని ప్రశ్నించటంతో మృతదేహం ఇక్కడ ఉండటానికి వీలు లేదని చెప్పడంతో గ్రామస్తులు, బంధువులు అర్ధరాత్రి సమయంలో గార పోలీసులకు సమాచారం అందించారు. గురువారం తెల్లవారు జామున గార పోలీసులు మృతదేహం వద్దకు చేరుకొని జరిగిన ఘటన వివరాలు పూర్తిస్థాయిలో తెలుసుకొని ఎచ్చర్ల పోలీసులకు సమాచారం ఇచ్చారన్నారు. అనంతం పోస్టుమాస్టర్ కోసం మృతదేహాన్ని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు.


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ వెంకటేష్

రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని కొత్తరోడ్డు దగ్గర బుధవారం రాత్రి సంభవించిన రోడ్డు ప్రమాదంలో కారు ఢీకొని కూన భరత్ కుమార్ (38) అనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి చెందినట్లు ఎస్ఐ కె.వెంకటేష్ తెలిపారు. ఎచ్చెర్ల మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన భరత్ కుమార్ హైదరాబాద్‌లోని ఇన్ఫోసిస్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. ఇటీవల జిల్లాకు విచ్చేసిన మృతుడు గార మండలం ఆడవరంలో ఉన్న అత్తవారింటికి మోటార్ సైకిల్‌పై వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తున్న సమయంలో కొత్త రోడ్డు జంక్షన్ వద్ద ఎదురుగా వస్తున్న ఒడిశాకు చెందిన కారు అతివేగంగా వచ్చి ఢీకొనడంతో భరత్ కుమార్ సంఘటనా స్థలంలోనే మృతిచెందాడు. మృతుడికి భార్య గాయత్రితో పాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్


గాయపడిన సింహాచలం

మండలం అక్కువరం పంచాయతీ శ్యామ సుందరాపురం సమీపం జాతీయ రహదారిపై గురువారం ఉదయం ఒకకారు అదుపుతప్పి ఇరువురిని ఢీకొంది. ఈ ప్రమాదంలో తాపీమేస్త్రి హనుమంతు సింహాచలంకు తీవ్ర గాయాలుకాగా మరో వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. అయితే కారు డ్రైవర్‌కు మూర్ఛ వ్యాధి రావడంతో కారు అదుపుతప్పి ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. గాయపడిన ఇద్దరిని టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స నిర్వహించగా సింహాచలం పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. దీనిపై ఎస్ఐ రాము కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలునిపై పిచ్చికుక్క దాడి

పొందూరు: పట్టణంలోని నాయుడు వీధిలో పిచ్చికుక్క స్వైర విహారం చేస్తుంది. గురు వారం వీధిలో ఆడుకుంటున్న బాలుడిపై పిచ్చికుక్క దాడి చేసి తీవ్రంగా గాయ పర్చింది. తొడ భాగంలో రక్తపు గాయాలైయ్యాయి. దాడి చేసిన సమయంలో వీధిలోని యువకులు చూసి కుక్కను కర్రలతో కొట్టడంతో పారిపోయింది. వెంటనే స్థానిక ఆస్పత్రికి తరలించి వైద్య సేవలందించారు. కుక్కల బెడద లేకుండా చేయాలని పంచాయతీ అధికారులను ప్రజలు కోరుతున్నారు.


గాయపడిన బాలుడు

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

శ్రీకాకుళం అర్బన్: నగరంలోని అరసవల్లి ప్రాంతంలో విద్యుత్ మరమ్మతులు కారణంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్టు ఎస్ఇ నాగిరెడ్డి కృష్ణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. అరసవల్లి ఫీడరు పరిధిలో ఉన్న వినియోగదారులు సహకరించాలని కోరారు. విద్యుత్ సంబంధిత సమస్యల పరిష్కారం కోసం టోల్ ఫ్రీ నెంబర్ 1912కు సంప్రదించాలని సూచించారు.

ఇకెవైసి తప్పనిసరి

పోలాకి: ప్రతి ఒక రైతు ఇకెవైసి తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని పోలాకి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అఫీషియల్ పర్సన్ ఇన్‌ఛార్జి ఎస్.పద్మావతి కోరారు. గురువారం వెదుల్లవలస సొసైటీ కార్యాలయంలో సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలాకి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో సభ్యత్వం కలిగిన రైతులు, రుణాలు తీసుకున్న రైతులు తప్పనిసరిగా ఇకెవైసి చేయించు కోవాలన్నారు. గ్రామ సచివాలయానికి వెళ్లి అక్కడ సిబ్బందితో ఇకెవైసి చేయించుకోవడం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రాయితీలు పొందవచ్చునని సూచించారు. సిఇఒ బి.రాంబాబు, కార్యదర్శి చంద్రరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

సత్తా చాటిన కరజాడ హైస్కూల్ విద్యార్థులు

ప్రజాశక్తి- మెళియాపుట్టి

జాతీయ వినియోగదారుల దినోత్సవం పురస్కరించుకొని జిల్లాస్థాయిలో నిర్వహించిన వినియోగదారుల న్యాయపాలన వర్చువల్ హియరింగ్, డిజిటల్ సౌకర్యం అనే అంశంపై వ్యాసరచన వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఇందులో పాల్గొన్న కరజాడ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు జి.కీర్తన తెలుగు వ్యాసరచనలో ప్రథమ, చాపర శ్రీజ, తెలుగు వక్తృత్వ పోటీలో ప్రథమ, మల్లారెడ్డి యువరాజ్ ఇంగ్లీష్ వక్తృత్వ పోటీలో ద్వితీయ స్థానం, వ్యాసరచనలో తృతీయ స్థానం సాధించారు. వీరికి నగదు పురస్కారం, సర్టిఫికెట్లను జాయింట్ కలెక్టర్ అందజేశారు. ఈ సందర్భంగా వీరిని హెచ్ఎం వెంకటరావు, జిల్లా వినియోగదారుల క్లబ్ మాస్టర్‌ట్రైనర్ ఎల్.వి.చలం, ఉపాధ్యాయులు శ్రీరాములు, ఆదినారాయణ, గోపాలకృష్ణ, శ్రీనివాసరావు, కె.గణేష్ కుమార్, రామరావు, సిహెచ్ యతిరాజ్, అర్జునుడు, పి.బాలరాజు, పి.బుడ్డు, దీనబంధు, ఆర్.సింహాచలం, పుష్పలత తదితరులు పాఠశాలలో అభినందించారు.


గ్రామస్తులతో మాట్లాడుతున్న నాయకులు

రైతులు సహకరిస్తే రోడ్డు నిర్మిస్తాం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

రైతులు సహకరిస్తే రోడ్డు నిర్మాణం చేపడతామని మండల తెలుగు యువత ప్రధాన కార్యదర్శి కోనారి కిరణ్ కుమార్ అన్నారు. కొండవూరు పంచాయతీ తుంబవాని పేట గ్రావెల్ రోడ్డును స్థానిక సర్పంచ్ కొల్లి భాస్కరరావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు కొండవూరు కొల్లిపాడు రహదారికి అనుసంధానంగా బిటి రహదారి నిర్మించాలని కోరారు. సరైన రహదారి లేక ఇబ్బంది పడుతున్నామని గ్రామస్తులు మొర పెట్టుకున్నారు. గ్రామస్తులు, రైతులు సహకరిస్తే సుమారు 500 మీటర్లను బిటి రహదారిగా మార్చడానికి స్థానిక ఎమ్మెల్యే గౌతు శిరీష సహకారంతో కృషి చేస్తానని ఆయన భరోసా ఇచ్చారు. రహదారికి అవసరమైన భూమి ఇవ్వడానికి గ్రామస్తులు ముందుకొచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు లండ ధనరాజ్, మాజీ సర్పంచ్ కొల్లి రమేష్, మాజీ ఎంపిటిసి అప్పన్న, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కృష్ణచైతన్య పుట్టినరోజు వేడుకలు

పోలాకి: మబగాంలో యువ నాయకుడు డాక్టర్ ధర్మాన కృష్ణచైతన్య జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్, ధర్మాన రాందాస్, ధర్మాన పద్మప్రియ, ధర్మాన సత్యవతమ్మ, ఎంపిపిలు ఆరంగి మురళీధర్, ముద్దాడ బైరాగి నాయుడు, వాన గోపి, జెడ్‌పిటిసి చింతు రామారావు, మాజీ కార్పొరేషన్ చైర్మన్ రాజాపు అప్పన్న, మండల అధ్యక్షులు కణితి కృష్ణారావు, ధర్మాన జగన్, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, గ్రామస్తులు పాల్గొన్నారు.


సిఐకు మొక్కను అందజేస్తున్న కృష్ణంరాజు

సిఐను కలిసిన కృష్ణంరాజు

పలాస: కాశీబుగ్గ పోలిస్‌స్టేషన్‌లో కాశీబుగ్గ సిఐ సూర్యనారాయణను గురువారం శ్రీశైన రాష్ట్ర సాధికారక కమిటీ మెంబర్, తెలుగు యువత జిల్లా మాజీ అధ్యక్షుడు బూరెల కృష్ణంరాజు మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం ఘనంగా సన్మానించారు.

గొంతువాపు నివారణ టీకాలు తప్పనిసరి

కోటబొమ్మాళి: వర్షాలకు పశువులకు ఎక్కువగా వ్యాప్తిచెందే గొంతువాపు వ్యాధికి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న నివారణ టీకాలు తప్పనిసరిగా పశువులకు వేయించాలని స్థానిక పశువైద్య సహాయ సంచాలకులు ఎం.లోకనాథం, పశు వైద్యాధికారి డాక్టర్ లఖినేని కిరణ్ కుమార్ అన్నారు. గురువారం కురుడులో ఉచితంగా గొంతువాపు వ్యాధి నివారణ టీకాలను 78 పశువులకు వేయటం జరిగిందన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాకు 10 వేలు గొంతువాపు నివారణ టీకాలు వచ్చాయన్నారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది వి.ఎ.కె.ముకుంథరావు, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

విలీన సభను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి- పలాస

డిసెంబరు 28న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే రెండు న్యూడెమోక్రసీ పార్టీల విలీన సభను విజయవంతం చేయాలని న్యూడెమోక్రసీ పార్టీ శ్రీకాకుళం జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్ పిలుపునిచ్చారు. గురువారం మండలం బొడ్డపాడు అమరవీరుల స్మారక భవనం ఆవరణలో నిర్వహించిన రెండు విప్లవ పార్టీల విలీనం సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విప్లవకారుల ఐక్యత, రెండు న్యూడెమోక్రసీ పార్టీల విలీన సభ డిసెంబర్ 28న జరుగుతుందని దీనికి ప్రజలు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ సభకు ప్రధాన వక్తగా సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి దర్శన్ సింగ్ ఖట్కర్ హాజరవుతారని తెలిపారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం ఫాసిస్టు విధానాలను అమలు చేస్తూ ప్రజల మధ్య ఉన్న సోదర భావాన్ని దెబ్బతీస్తుందన్నారు. గత పదేళ్ల కాలంగా పచ్చి కార్పొరేట్ దోపిడీ విధానాలను అవలంభిస్తూ దేశ సహజ సంపదనంతా దోచిపెట్టిందన్నారు. దేశంలో ఆకలి, అసమానతలు, నిరుద్యోగం, హక్కుల హనన, ప్రశ్నించే వారిని అణిచివేయడం నిత్యకృత్యంగా జరుగుతుందన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఇలాంటి కష్ట కాలంలో దేశంలో ఉన్న విప్లవకారులంతా ఐక్యమై ప్రజల తరఫున పోరాటం చేయాలన్నారు. భవిష్యత్‌లో విప్లవకారులందరినీ ఐక్యం చేసి బలమైన ప్రజా ఉద్యమాలను నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో అరుణోదయ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నశెట్టి రాజశేఖర్, ఎఐకెఎంఎస్ జిల్లా నాయకులు గొరకల బాలకృష్ణ, పిఒడబ్ల్యు జిల్లా ప్రధాన కార్యదర్శి పోతనపల్లి కుసుమ, పివైఎల్ జిల్లా కన్వీనర్ సార జగన్, ఐఎఫ్‌టియు జిల్లా నాయకులు బర్ల గోపి, పోతనపల్లి మల్లేశ్వరరావు, ఎఐకెఎంఎస్ జిల్లా నాయకులు రాపాక మాధవరావు, జి.కామేశ్వరరావు, జె.అప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

నిరాశ్రయులకు అల్పాహారం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

క్రిస్మస్‌ను పురస్కరించుకొని నగరంలోని గొంటివీధిలో గల పట్టణ నిరాశ్రయుల భవనంలో ఉన్న పేదలకు కొంక్యాన గోవిందదాజులు ట్రస్ట్ ఆధ్వర్యాన అల్పాహారాన్ని అందజేశారు. గురువారం ట్రస్ట్ సభ్యులు, ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి కొంక్యాన వేణుగోపాల్ అల్పాహారాన్ని అందజేశారు. తన సోదరి దివంగత కొంక్యాన రాజేశ్వరి జ్ఞాపకార్థం ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నీళ్ల ట్యాంకర్ నిండి నీళ్లన్నీ వృధాగా పోవడం వల్ల అక్కడ నివాసముంటున్న వారు ఇబ్బందులకు గురై అనారోగ్యం పాలవుతున్నారని, పైపులు విరిగి నీటి సదుపాయం కూడా సరిగా లేక తాగునీటికి అవస్థలు పడుతున్నారని, మరోవైపు తినడానికి తిండి లేక పస్తులు ఉండాల్సి వస్తోందని, వారిని ఆదుకునేందుకు మున్సిపల్ యంత్రాంగం చర్యలు చేపట్టాలని కోరారు.

కార్యక్రమంలో శివతేజ, ట్రస్ట్ కుటుంబ సభ్యులు సరోజ, శివ శంకర్, సిక్కోలు స్వచ్ఛంద సేవ సమితి ప్రతినిధి పొడుగు చరణ్, పెద్దపాడు సేవకులు బొట్టా సాయి కుమార్, నంది ఉమా శంకర్ పాల్గొన్నారు.

నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని వైసిపి నాయకులు, సర్పంచి నర్తు ప్రేమ్ కుమార్ గురువారం సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈదుపురం 1,2వ వార్డుల్లో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.11లక్షల అంచనా విలువలతో మూడు సిసి రోడ్ల నిర్మాణం చెప్పట్టడం జరుగుతుందన్నారు. ఇప్పటికే 1.5 కోట్లు ఎన్ఆర్‌జిఎస్ నిధులతో సిసి రోడ్లు, కాలువల పనులు జరుతున్నాయని, మొత్తం పనులు జనవరి చివరి నాటికి పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ మండలో మురా బెహరా, తోఖిరో బెహరా,


రోడ్డు పనులను పరిశీలిస్తున్న ప్రేమ్‌కుమార్

బోనమాలి బెహరా, జోయోమంగల్ బెహరా, హంగిర్ బెహరా, ఉదయ్ బెహరా తదితరులు పాల్గొన్నారు.


జెండా ఆవిష్కరిస్తున్న సిపిఐ నాయకులు

పేదల పక్షాన సిపిఐ పోరాటం

ప్రజాశక్తి- పలాస

కాశీబుగ్గ బస్టాండ్ సమీపంలో సిపిఐ శత వార్షికోత్సవాల జెండాను సిపిఐ పలాస నియోజకవర్గం కార్యదర్శి చాపర వేణుగోపాల్ గురువారం ఆవిష్కరించారు. సందర్భంగా సిపిఐ నియోజక కార్యదర్శి చాపర వేణు మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ డిసెంబర్ 26, 1925లోఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో ప్రారంభించడం జరిగిందన్నారు. కమ్యూనిస్టు పార్టీ నిర్బంధంలో పుట్టి పెరిగిన పార్టీ అన్నారు. బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా భారతదేశంలో సంపూర్ణ స్వాతంత్రం రావాలని పిలుపునిచ్చినటువంటి ఏకైక పార్టీ కమ్యూనిస్టు పార్టీ అన్నారు. భూ పోరాటం ద్వారా పేదలకు భూ పంపిణీ చేపట్టడం జరిగిందన్నారు. ట్రూ అప్ చార్జీల పేరుతో 6 వేల 72 కోట్లు, చార్జీల పేరుతో 9 వేల 412 కోట్లు ప్రజలపై పన్ను భారం మోపుతున్నారన్నారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు సుందరరావు, ఎఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ రవి, సిపిఐ నాయకులు ముకుందరావు, మున్నా, స్వామి, చిన్న, గుణశేఖర, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విద్య నేర్చుకోవాలి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

క్రమశిక్షణతో విద్య నేర్చుకోవాలని జిల్లా యువమోర్చా కార్యదర్శి ధనుష్ రంగ అన్నారు. గురువారం స్థానిక కస్తూరి భా గాంధీ బాలికల విద్యాలయంలో వీరబాల దివాస్ కార్యక్రమం జిల్లా యువమోర్చా కార్యదర్శి ధనుష్ రంగ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా కార్యదర్శి ప్రసాదరావు, జిల్లా మహిళామోర్చా అధ్యక్షులు లక్ష్మి, కార్యకర్తలు, కస్తూరిబా స్కూల్ ప్రిన్సిపాల్ శిరీష, యాజమాన్యంతో పాటు 200 మంది పిల్లలు పాల్గొన్నారు. వారికి వీరబాల దివాస్ యొక్క ప్రాముఖ్యతను వివరించారు.


మాట్లాడుతున్న ధనుష్ రంగ

ఎఐవైఎఫ్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి

శ్రీకాకుళం అర్బన్: అఖిల భారత యువజన సమాఖ్య 22వ రాష్ట్ర మహాసభలు వచ్చే ఏడాది ఫిబ్రవరి 6 నుంచి 9 వరకు శ్రీకాకుళం జిల్లాలో నిర్వహిస్తున్నామని, ఈ మహాసభలను విజయవంతం చేయాలని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు పరుచూరి రాజేంద్ర ప్రసాద్ పిలుపునిచ్చారు. గురువారం క్రాంతిభవన్‌లో మహాసభల పోస్టర్‌ను ఆయన విడుదల చేశారు. ఈ మహాసభలకు ఆహ్వాన సంఘం గౌరవాధ్యక్షునిగా రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వ్యవహరిస్తారని తెలిపారు. సభలకు సిపిఐ సీనియర్ నాయకులు సిహెచ్ సుందర్‌లాల్, చీఫ్ పాట్రన్స్‌గా కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, విజయనగరం ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు, ప్రధాన కార్యదర్శిగా యుగంధర్, కోశాధికారిగా చాపర వెంకట రమణ, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కొన్న శ్రీనివాస రావులు వ్యవహరిస్తారని తెలిపారు. సభకు ఎమ్మెల్యే గొండు శంకర్‌తో పాటు జిల్లాలోని ఇతర నియోజ కవర్గాల ఎమ్మెల్యేలు హాజరవుతారన్నారు. మహాసభల్లో సమగ్ర


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రాజేంద్ర ప్రసాద్

యువజన విధానం, నూతన పరిశ్రమల ఏర్పాటు, యువతకు ఉపాధి, తదితర అంశాలపై చర్చ సాగుతుందని, భవిష్యత్ ఉద్యమ రూపకల్పన జరుగుతుందన్నారు. సమావేశంలో ఎఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మొజ్జాడ యుగంధర్, జిల్లా కార్యదర్శి కొన్న శ్రీనివాసరావు, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్.నాగభూషణం, సిపిఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకట రమణ, నాయకులు వెంకటరమణ, కర్ణ వీరుడు, ఆమోష్, అరవింద్, వసంతరావు, గిరి, వెంకటేష్ పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల అనర్థాలపై అవగాహన

ప్రజాశక్తి- ఆమదాలవలస

మాదకద్రవ్యాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ కె.వెంకటేష్ అన్నారు. గురువారం పట్టణ శివారులో ఉన్న శ్రీవాణి విద్యానికేతన్ పాఠశాలలో విద్యార్థులకు సంకల్పం పేరిట మాదక ద్రవ్యాలు, సైబర్ నేరాలు, మైనర్ డ్రైవింగ్ యాక్ట్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు బాల్యం నుంచే మంచి అలవాట్లను అలవర్చుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. యువత మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని, గంజాయిని ఎవరైనా విక్రయించినా లేదా సరఫరా చేసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలన్నారు. సైబర్ నేరాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. మైనర్లు వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమన్నారు. మైనర్లకు వాహనాలను ఇస్తే వారి తల్లిదండ్రులపై కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ వెంకటేష్

పాఠశాల డైరెక్టర్ బలివాడ వెంకటేశ్వర్లు, కరస్పాండెంట్ బలివాడ నారాయణమూర్తి, పాఠశాల హెచ్ఎం బలివాడ సంపత్ కుమార్, పాఠశాల ఇన్‌ఛార్జి జి.హరిబాబు, ఉపాధ్యాయులు కె.వి రాజారావు, ఎస్.వి.రమణ, బి.ప్రణవి, బి.తరుణ్, అప్పలనాయుడు, శ్రీరాములు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరీక్షా పే చర్చపై అవగాహన

ప్రజాశక్తి- కవిటి

భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీతో దేశవ్యాప్తంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సంభాషించే కార్యక్రమం పరీక్ష పే చర్చ అని ఎంఇఒలు ధనుంజయ మజ్జి, కె. చిట్టిబాబు అన్నారు. పరీక్ష పే చర్చపై గురువారం సాయంత్రం కవిటిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బోర్డు ప్రవేశ పరీక్షలు ఎలా ఎదుర్కోవాలి, ఒత్తిడి లేని చదువులు, జీవిత లక్ష్యాలను ఏ విధంగా సాధించాలి వంటి అంశాలు ఈ కార్యక్రమంలో ఉంటాయని వారు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రధానమంత్రితో మాట్లాడే అవకాశం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు కలుగుతుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో పాల్గొనే వారు పేర్లు ఏ విధంగా నమోదు చేసుకోవాలి, ఏమేం చేయాలి అనే అంశాలపై డైట్ విద్యార్థిని పత్రి విజయలక్ష్మి శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రాథమిక, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాల ప్రిన్సిపాళ్లు, డైట్ విద్యార్థులు,


అవగాహన కల్పిస్తున్న విద్యాశాఖాధికారులు

కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో పరీక్ష పే చర్చా రిజిస్ట్రేషన్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఉన్నత పాఠశాలలు, ప్రాథమికోన్నత, జూనియర్ కళాశాలల హెచ్ఎంలు, ప్రిన్సిపాళ్లకు ఎంఇఒ ఆధ్వర్యంలో అవగాహన సమావేశం నిర్వహించారు. సమావేశంలో హెచ్ఎంలు, ప్రిన్సిపాళ్ల,డైట్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.


సిమెంట్ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ తదితరులు

కూటమితోనే అభివృద్ధి

ప్రజాశక్తి- లావేరు

కూటమి ప్రభుత్వంతోనే గ్రామ అభివృద్ధి సాధ్యమని, సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ రాష్ట్ర అభివృద్ధికి నిరంతరం పనిచేస్తున్నారని గురుగుబిల్లి సర్పంచ్ బాడిత కళ్యాణ్ లక్ష్మణరావు అన్నారు. పల్లెపండగ కార్యక్రమంలో మంజూరైన రూ.10 లక్షల నిధులతో సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసిపి పాలనలో గ్రామాభివృద్ధి కుంటుపడిందన్నారు. కార్యక్రమంలో సాగునీటి సంఘం అధ్యక్షుడు బాడిత చిట్టిబాబు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ మౌనిక, సచివాలయ సిబ్బంది సత్తిబాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సస్యరక్షణతో అధిక దిగుబడులు

ప్రజాశక్తి- నందిగాం

రబీ సీజన్‌లో వేసుకునే అపరాల పంటలైన పెసర, మినుము, కంది వంటి పంటలకు సస్యరక్షణ చర్యలు చేపడితే దిగుబడులు పొందే వీలుంటుందని వ్యవసాయ అధికారి పి. శ్రీకాంత్ వర్మ అన్నారు. గురువారం మండలంలోని దీనబంధు పురం, దేవిపురంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ వ్యవసాయశాఖ అందించే సూచనలు, సలహాలు పాటించి మంచి దిగుబడులు పొందాలన్నారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ అసిస్టెంట్ నవీన్, రైతులు ఉన్నారు.



మాట్లాడుతున్న ఎఒ శ్రీకాంత్ వర్మ